ప్రజాశక్తి
గురువారం మే 9 2024 8 పేజీలు
శ్రీకాకుళం

ఎన్నికల వాహనాలకు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ
ఎస్‌పి జి.ఆర్ రాధిక
(...8లో)

పాతపట్నంలో పాగా వేసేదెవరు?

- ప్రచారంలో దూసుకెళ్తున్న శాంతి
- టిడిపి అభ్యర్థి గోవిందరావుకి అంతా అశాంతే
- కేడర్‌తో కొరవడిన సమన్వయం
- కలమట గ్రూపుతో కయ్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పాతపట్నం నియోజకవర్గంలో ఈసారి ఎవరు పాగా వేస్తారనేది అందరిలోనూ ఆసక్తిగా మారింది. వైసిపి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అభ్యర్థిగా పోటీ చేస్తుండగా, టిడిపి నుంచి మామిడి గోవిందరావు బరిలో దిగుతున్నారు. పాతపట్నం టిక్కెట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కలమట వెంకటరమణకే దక్కుతుందని అంతా భావించినా అధిష్టానం మాత్రం అనూహ్యంగా గోవిందరావుకు టిక్కెట్ కేటాయించింది. పార్టీ ఎంతో నమ్మకంతో సీటు ఇస్తే దాన్ని నిలుపుకునే పరిస్థితిలో ఆయన కనిపించడం లేదని, పార్టీ కేడర్‌ను కలుపుకొని పోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గెలుస్తామని ఇప్పటివరకు ధీమాగా ఉన్న పార్టీ శ్రేణులు ఆయన వైఖరితో ఆ ఆశలు సన్నగిల్లుతున్నాయి.

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సమయం సమీపిస్తుండడంతో, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థులు సర్వశక్తులూ ఒడ్డి పోరాడుతున్నారు. గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. రోజులో అత్యధిక సమయం ప్రచారానికే వెచ్చిస్తున్నారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా కార్యకర్తలతో కలిసి వీధుల్లో తిరుగుతున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటున్నారు. కేడర్‌ను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. కార్యకర్తలకు ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. టిడిపి అభ్యర్థి మామిడి గోవిందరావు పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకోవడంలో విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల (మిగతా...2లో)

రెడ్డి శాంతి

మామిడి గోవిందరావు

ఎన్నికల నిర్వహణపై అప్రమత్తం

- సెక్టోరియల్ అధికారులు బాధ్యతగా పనిచేయాలి
- ఉదయం 7 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్
- జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారులు బాధ్యతగా పనిచేయాలని, ఎన్నికల సంఘం సూచనలను శతశాతం తూచా తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. ఎన్నికల సెక్టోరియల్ అధికారులకు ఇవిఎం హేండ్స్ ఆన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులు ఎన్నికల కమిషన్ ఆదేశాలనుసారం 72 గంటల ప్రోటోకాల్ చాలా కీలకమన్నారు. ఆయా కేంద్రాలకు వెళ్లి ఎటువంటి సమస్యలున్నా సత్వర పరిష్కారానికి చర్యలు, సమయపాలన పాటించాలన్నారు. సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహించాలని సూచించారు. రిసెప్షన్ సెంటర్ ఎచ్చెర్లలోని శివానీ (మిగతా...2లో)

మాట్లాడుతున్న ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

పాలిసెట్‌లో మెరిసిన విద్యార్థులు

112వ ర్యాంకుతో జిల్లా టాపర్‌గా అరవింద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పోలాకి

ఎపి పాలిసెట్ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు పొందారు. పోలాకి మండలం జిల్లేడుమాకివలసకు చెందిన గొల్లంగి అరవింద్ 112వ ర్యాంకుతో జిల్లా టాపర్‌గా నిలిచారు. తండ్రి రమణమూర్తి, శ్రీదేవి వ్యవసాయ పనులు చేస్తుంటారు. అరవింద్‌కు పదో తరగతిలో 573 మార్కులు వచ్చాయి. ఆమదాలవలస మండలం రెడ్డి క్వార్టర్స్ కూన హర్షితకు 115వ ర్యాంకు వచ్చింది. కోటబొమ్మాళికి చెందిన సకలాబత్తుల శ్రీవల్లి 143వ ర్యాంకు సాధించారు. తండ్రి కూన హరికృష్ణ (నాగు) ట్రావెల్స్ నడుపుతున్నారు. తల్లి జలజాక్షి పాలకొండ కోర్టులో ఉద్యోగిగా పనిచేస్తున్నారు.

పాలిసెట్ ఫలితాల్లో పోలాకి మండలంలోని శ్రీ జ్ఞానజ్యోతి స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గొల్లంగి అరవింద్ 112వ ర్యాంకు సాధించగా, కురిమిని హేమసుందర్ రెడ్డి 612, పట్నాన నాగేంద్ర 642, పల్ల రవివర్మ 852 ర్యాంకు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

కూన హర్షిత

పాలిసెట్‌లో 88.09 శాతం ఉత్తీర్ణత

జిల్లాలో పాలిసెట్ పరీక్షలకు హాజరైన వారిలో 88.09 శాతం ఉత్తీర్ణత సాధించారు. పరీక్షల్లో బాలికలే అధిక శాతం మంది పాసయ్యారు. బాలికలు 4,583 మంది హాజరు కాగా 4,124 మంది (89.98శాతం) ఉత్తీర్ణులయ్యారు. 6,288 మంది బాలురు హాజరు కాగా 5,452 మంది (86.70 శాతం) పాసయ్యారు.

అరవింద్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

పోస్టల్ బ్యాలెట్‌కు నేడు ఆఖరు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు నేడు చివరి అవకాశాన్ని కల్పిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజులుగా జిల్లాలో 41,225 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఆయా ఫెసిలియేషన్ సెంటర్లలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని పేర్కొన్నారు. ఇంకా ఓటు హక్కు వినియోగించుకోని ఉద్యోగులు గురువారం సాయంత్రం ఐదు గంటల వరకు వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

సౌకర్యంగా ఓటు వేయొచ్చు

- వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు
- పోలింగ్ కేంద్రంలో ర్యాంపులు, వీల్ చైర్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం, పొందూరు

శతశాతం పోలింగ్ సాధించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న ఎన్నికల సంఘం అందుకు తగ్గ అన్ని మార్గాలపై దృష్టిసారించింది. ఇందులో భాగంగానే వికలాంగులందరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలను వికలాంగుల ఫ్రెండ్లీగా తీర్చిదిద్దుతోంది. వికలాంగులు, వృద్ధులు, గర్భిణులు, ఎన్నికల సంఘం గుర్తించిన వ్యాధిగ్రస్తులు సులభతరంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లా యంత్రాంగం పక్కా ఏర్పాట్లు చేస్తోంది. వారు పోలింగ్ కేంద్రానికి చేరుకుని, ఓటు వేసి తిరిగి ఇంటికి వెళ్లే వరకు అధికారులు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 21,481 మంది వికలాంగులు ఓటర్లుగా నమోదయ్యారు. వీరంతా ప్రస్తుత సాధారణ ఎన్నికల్లో తప్పక ఓటు వేసేలా ఎన్నికల అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

ఈ జాబితాలోని వారు ప్రత్యేక సౌకర్యాలు పొందవచ్చు

- అంధత్వం, తక్కువ దృష్టి, వినికిడి లోపం, చలన / శారీరక వైకల్యం, మానసిక వైకల్యం / బుద్ధిమాంద్యం
- మానసిక రుగ్మత, యాసిడ్ దాడి బాధితులు, తలసేమియా, హెమోఫిల్ల (రక్తం గడ్డకట్టని స్థితి), మెదడు పక్షవాతం, ఆటిజం, బహుళ వైకల్యం, కుష్టువ్యాధి నయమైనవారు
- మరుగుజ్జు, దీర్ఘకాలిక నరాల సమస్య, నరాల బలహీనత, కండరాల క్షీణత, నాడీ వ్యవస్థలో సమస్యలున్న వారు.

ప్రత్యేక సదుపాయాలు ఇలా...

- పోలింగ్ బూత్ వరకు వికలాంగులను తీసుకొచ్చి, వారు ఓటు (మిగతా...2లో)

సౌకర్యంగా ఓటు వేయొచ్చు

వేసిన తర్వాత తిరిగి వాహనంలో ఇంటికి చేర్చుతారు. ఈ రవాణా సదుపాయం ఉచితమే.

- ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ట్రైసైకిల్ అందుబాటులో ఉంటుంది. మూగ, చెవిటి ఓటర్లకు సైన్ లాంగ్వేజీ ద్వారా ఓటు వేసే సదుపాయం కల్పిస్తారు.
- పోలింగ్ కేంద్రాల్లోకి సులువుగా రాకపోకలకు ర్యాంపులు నిర్మించారు.
- అంధులకు సహాయంగా పోలింగ్ కేంద్రంలోకి ఒకరిని అనుమతిస్తారు.

సాక్షం యాప్

వికలాంగుల సహాయం కోసం ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా సాక్షం యాప్ రూపొందించింది. ఓటరుగా నమోదు చేసుకోవడం, మార్పులు, చేర్పులు, పోలింగ్ కేంద్రాన్ని తెలుసుకోడం, వీల్ చైర్, రవాణా సదుపాయాన్ని కోసం అభ్యర్థన, అంధులకు వాయిస్ ద్వారా సహకరించడం, వినికిడి లోపం ఉన్న వారికి టెక్ట్స్ టు స్పీచ్ థెరపీ తదితర సహాయ సహకారాలను ఈ యాప్ ద్వారా వికలాంగులు పొందవచ్చు.

మోడల్ పోలింగ్ స్టేషన్లు

వికలాంగుల్లో ఓటు వేసే విధానంపై మరింత అవగాహన కల్పించేందుకు, వారిని పోలింగ్ కేంద్రాలకు రప్పించేందుకు జిల్లాలో రెండు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎచ్చెర్ల మండలంలో భగీరథపురం పోలింగ్ స్టేషన్, పలాస నియోజకవర్గంలో వజ్రపుకొత్తూరు మండలంలోని పల్లెసారథి పోలింగ్ కేంద్రాలను మోడల్ పోలింగ్ కేంద్రాలుగా తీర్చిదిద్దారు. ఆయా కేంద్రాల పరిధిలో ఇక్కడ ఎక్కువ మంది వికలాంగ ఓటర్లు ఉన్నారు. ఇక్కడ ర్యాంపులు, తాగునీరు, వైద్య సదుపాయంతో పాటు ప్రత్యేక మరుగుదొడ్లనూ ఏర్పాటు చేశారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

వికలాంగులు, వృద్ధులు, గర్భిణులు, కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిన వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక క్యూ ఏర్పాటు చేస్తున్నాం. పోలింగ్ కేంద్రాలకు అతి సమీపంలో వాహనాల పార్కింగ్, గ్రౌండ్ ఫ్లోర్‌లోనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఒకరు చొప్పున ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ వలంటీరును అందుబాటులో ఉంచుతున్నాం. గడిచిన ఎన్నికల్లో 70 శాతం మంది వికలాంగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈసారి శత శాతం సాధించాలన్నదే లక్ష్యం.

- కె.కవిత, ఎడి, వికలాంగుల సంక్షేమశాఖ

ఎన్నికల నిర్వహణపై అప్రమత్తం

ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 17 అంశాలతో కూడిన ఫార్మాట్ ఉంటుందన్నారు. పోలింగ్ మెటీరియల్ పూర్తిస్థాయిలో తీసుకున్నది చెక్‌లిస్ట్ ద్వారా పరిశీలించుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈనెల 13న పోలింగ్ ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరుగుతుందన్నారు.

సెక్టోరియల్ అధికారులు పోలింగ్ రోజున అన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధించి రిపోర్టులను ఎన్నికల కంట్రోల్ రూమ్‌కు నియమావళి ప్రకారం అందజేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. ఏదైనా పోలింగ్ కేంద్రంలో సమస్యలు ఉంటే తక్షణమే స్పందించి పరిష్కరించాలన్నారు. స్క్రూట్నీ ఫార్మేషన్స్ సకాలంలో నిర్వహించాలని చెప్పారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పూర్తి మెటీరియల్ అందజేయనున్నట్లు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

పోలింగ్ కేంద్రంలో ఇవిఎంల్లో సమస్య ఉత్పన్నమైతే సెక్టోరియల్ అధికారులు రిజర్వ్ పరికరాలతో వాటిని భర్తీ చేయాలని చెప్పారు. శిక్షణా తరగతుల్లో ఇవిఎంల నిర్వహణకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ వెంకటేశ్వరరావు, శిక్షణా తరగతుల నోడల్ అధికారి బాలాజీ నాయుక్, మాస్టర్ ట్రైనర్ శేషగిరి, కిరణ్, ఎన్ఐసి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాగా వేసేదెవరు?

ఖర్చుకు తగినంత డబ్బుల్లేక ఫైనాన్స్ ఫ్రస్టేషన్‌లో కేడర్‌పై అసహనం వ్యక్తం చేస్తుండడంతో, కొంతమంది అలకబూనినట్లు తెలుస్తోంది. నియోజకవర్గ ఇన్‌ఛార్జి కలమట వెంకటరమణకు టిక్కెట్ రాలేదన్న అసంతృప్తి ఆయన కేడర్‌లో నెలకొంది. ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలంటూ కలమటపై పార్టీ శ్రేణులు తీవ్ర ఒత్తిడి తెచ్చాయి. ఇండిపెండెంట్‌గా కలమట పోటీ చేయడంపై ఆలోచిస్తున్న తరుణంలో గత నెల 24న టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంలో శ్రీకాకుళంకు పిలిపించి మాట్లాడారు. ఆ తర్వాత ఆయనకు పార్టీ జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వడం, పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పడంతో కొంత సమస్య తీరింది.

నోటి దురుసుతనంతో దూరమవుతున్న కేడర్

పాతపట్నం నియోజకవర్గంలో అసమ్మతి కాస్త సద్దుమణిగిందన్న తరుణంలో టిడిపి అభ్యర్థి మామిడి గోవిందరావు నోటిదురుసుతనం మళ్లీ మంటలను రేపింది. ఎన్నికల్లో పనిచేయకుండా ఏం చేస్తున్నారంటూ కలమట గ్రూపునకు చెందిన పలువురు నాయకులను అసభ్య పదజాలంతో దూషించినట్లు తెలిసింది. దీంతో వారంతా లోలోపల మండిపోతున్నారు. ఎన్నికల్లో ఎలా గెలుస్తారో చూస్తామంటూ హెచ్చరించినట్లు తెలిసింది.

రియల్ వ్యాపారాలపై ఆరోపణలు

రియల్ ఎస్టేట్ వ్యాపారంలో గోవిందరావు తమను మోసం చేశారంటూ ఆరోపణలు రావడం పార్టీకి ఇబ్బందిగా పరిణమించింది. ఆయనతో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశానని చెప్తున్న శ్రీకాకుళానికి చెందిన ఓ వ్యాపారి భాగస్వామి తనకు చెందిన 22 ప్లాట్లను ఫోర్జరీ చేసి భూములు అమ్మేశారని ఆవేదన వ్యక్తం చేస్తూ విడుదల చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మామిడి గోవిందరావుపై ఉన్న ఆరోపణలు నిజమో, కాదో తెలియకపోయినా ఈ సమయంలో అవి తెరపైకి రావడం గెలుపుపై ప్రభావం చూపుతుందనే చర్చ నడుస్తోంది.

ప్రచారంలో దూసుకుపోతున్న రెడ్డి శాంతి

టిడిపి అభ్యర్థి మామిడి గోవిందరావు వైఖరితో వైసిపికి లబ్ధి చేకూరేలా కనిపిస్తోంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే సమయానికి అసమ్మతి, గ్రూపుల పోరుతో సతమతమైన వైసిపి అభ్యర్థి రెడ్డి శాంతికి పరిస్థితులు క్రమేణా సానుకూలంగా మారుతున్నాయి. అసమ్మతి నాయకులు, తనను వ్యతిరేకించే వాళ్లు పార్టీ విడిచి వెళ్లినా ప్రశాంతంగా ప్రచారం చేసుకుంటున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోకి వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. నియోజకవర్గంలో కొంతమంది నాయకులు వ్యతిరేకించినా, తనకు ఏ విశ్వాసంతో పార్టీ మళ్లీ టిక్కెట్ ఇచ్చిందో అదే నమ్మకంతో ముందుకు సాగుతున్నారు. దీనికితోడు టిడిపిలోని ఓ గ్రూపు ఆమెకు లోపాయికారీగా మద్దతు ఇవ్వడంతో గెలుపుపై వైసిపి నాయకులు మరింత ధీమా వ్యక్తం చేస్తున్నారు.

FORMAT C-1

(FOR CANDIDATE TO PUBLISH IN NEWSPAPERS, (TV) DECLARATION ABOUT CRIMINAL CASES

(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No.536 of 2011 (Public Interest Foundation & Ors. Vs.Union of India & Anr.)

Name and address of candidate : **Duvvada Srinivas, S/o.Late Krishna Murty, 1-291, Venkateswara Colony, Tekkali Post, Tekkali town & Mandal, Srikakulam Dist, A.P. - 532201.**

Name of Political Party : **YUVAJANA SHRAMIKA RYTHU CONGRESS PARTY (YSRCP)**

(Independent candidates should write ''Independent'' here)

Name of Election : **GENERAL ELECTIONS HOM/ APLA - 2024.**

Name of Constituency : **03 - TEKKALI ASSEMBLY CONSTITUENCY.**

I, DUVVADA SRINIVAS (Name of Candidate), a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

	Pending criminal cases		Details about cases of conviction for criminal offences		
Sl. No.	Name of Court	Case No.and Status of case	Section(s) of Acts Concerned and brief description of offense(s)	Name of Court & Date (s) of order (s)	Description of Offense (s) & punishment imposed
1	Before The Hon'ble Asst. Sessions Judge Court, Tekkali	Cr.No.12/11 Numbered as S.C. No.124/2018, pending with Naupada Police Station, Santhabommali Mandal, Srikakulam Dist. Status of Case : For Framing of Charges	Sec. 147, 148, 307, 332, 353, 120-B, r/w sec.149 IPC. Sec.3&5 of PDP Act. and Under Sec.7(1) (d) of Criminal Amendment Act.	Not Applicable	Not Applicable
2	Before The Hon'ble Asst. Sessions Judge Court, Tekkali	Cr.No.4/11 Numbered as S.C. No.82/2019, pending with Santhabommali Police Station, Santhabommali Mandal, Srikakulam Dist. Status of Case: For Framing of Charges.	Sec. 147, 148, 353, 341, 506, 120-B, 307 IPC r/w. Sec.149 IPC. Sec.3&5 of PDP Act. And Under Sec. 7(1) (d) of Criminal Amendment Act.	Not Applicable	Not Applicable
3	Before The Hon'ble Asst. Sessions Judge Court, Tekkali	Cr.No.16/11 Numbered as S.C. No.24/2020, pending with Naupada Police Station, Santhabommali Mandal, Srikakulam Dist. Status of Case: For Framing of Charges.	Sec. 147, 148, 188, 307, 332, 353, 120-B, 435, 436 r/w Sec.149 IPC. Sec.3 of PDP Act.	Not Applicable	Not Applicable
4	Before The Hon'ble Judicial First Class Magistrate Court, Kotabommali.	Cr.No.17/11 Numbered as P.R.C.No.. 11/2017, pending with Naupada Police Station, Santhabommali Mandal, Srikakulam Dist. Status of Case: For committal to the sessions court.	Sec. 147, 148, 188, 307, 332, 353, IPC, r/w sec.149 IPC Sec.3 of PDP Act.	Not Applicable	Not Applicable
5	Before the Subdivisional Magistrate, Parlakhimidi, Gajapathi Dist, Odisha.	2(c) C.C.No.9/10 pending with Mines Office, Parlakhimidi, Gajapathi Dist, Odisha.	Under Sec.22 of M.M (D&R) Act.1957 & rule 68-1 (ii) OMMC, Rule 2004.	Not Applicable	Not Applicable

తరువాయి 3 పేజీలో..

2వ పేజీ తరువాయి

6	Special Judge Vigilance, Berhampur, Gajapathi Dist, Odisha	G.R.No.37/12 of Vigilance Berhampur.	Under Sec.13(2) r/w 13(1) P.C. Act. And Sec. 420, 468, 120-B IPC.	Not Applicable	Not Applicable

In the case of election of Council of States or election to Legislative Council by MLAs, mention the election concerned in place of name of constituency.

SD/- DUVVADA SRINIVAS
TEKKALI ASSEMBLY CONTITUENCY -03

మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో లైదాం సమీపంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ రామ కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన తనిఖీల్లో 50 అక్రమ మద్యం సీసాలను పట్టుకున్నారు. మండలం లోని లైదాంకు చెందిన దేవరపల్లి రామకృష్ణ మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుకొని ఆయన నుంచి 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఇబి సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుకున్న మద్యం సీసాలతో ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది

ఆస్తి తగాదాతో ఇంటిని తగులబెట్టారు

వివరాలను సేకరిస్తున్న ఎస్ఐ కిశోర్ వర్మ

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం హనుమంతునాయుడుపేట పంచాయతీ పోతునాయుడుపేట కాలనీలో నివాసం ఉంటున్న బేపల ఈశ్వరరావు, కవిత దంపతులు ఇల్లును మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. అదే ఇంటి స్థలంపై గతేడాదిగా స్థానిక సర్పంచ్ పాల మహాలక్ష్మి అనుచరులకు, బాధిత కుటుంబానికి కోర్టులో ఆస్తి తగాదాలు ఉన్నాయి. అయితే న్యాయపరంగా తేల్చుకోవలసిన అంశాన్ని ఇంటిని తగులుపట్టే వరకు రావడంపై బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రెండు వారాలు క్రితం రేకిల్లును మరమ్మతుల కోసం తొలగించి పరదాలు కట్టారు. వాటి స్థానంలో గోడలు ఏర్పాటు చేసి సిమెంట్ రేకులు వేయాలనుకుంటున్నాడు. ఈ సమయంలో తన ఇంట్లో సామగ్రిని హనుమంతునాయుడుపేట సర్పంచ్ ప్రతినిధి పాల మహేష్, జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి ప్రోత్సాహంతో అదే గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్తలు కాల్చేశారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. గతంలో తన ఇంటిలో కుటుంబ సభ్యులతో గడుపుతున్న నేపథ్యంలో సర్పంచ్ ప్రతినిధి మహేష్ అనుచరులు ఇంటిపైన దౌర్జన్యంగా దాడి చేసి భయభ్రాంతులకు గురిచేశారని అన్నారు. అదే ఇంట్లో 20 ఏళ్లుగా నివాసం ఉంటున్నానని, దీంతో రెవెన్యూ అధికారులు ఇచ్చిన పొజిషన్ ధ్రువపత్రం కూడా ఇచ్చినట్లు తెలిపారు. అయితే అప్పటి నుంచి సర్పంచ్ అనుచరులు ఆస్తి కోసం తన వేధిస్తున్నారని, ఇంటి నిర్మాణాన్ని చేపడుతుంటే గొడవలు సృష్టించి దాడులు చేస్తున్నారని వాపోయారు. దీంతో అనుమానితులుగా భావిస్తున్న ఐదురుగు వ్యక్తులపై బాధితుడు నౌపడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఘటనా స్థలాన్ని నౌపడా ఎస్ఐ కిషోర్ వర్మ, సిబ్బంది చేరుకొని జరిగిన ఘటనపై ఆరా తీశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఇంటిపై ఏడాదిగా తగాద నడుస్తోందని, ఎటువంటి రాజకీయ కారణాలు లేవని ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలకు పాల్పడం సరికాదని అన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు.

వైసిపికి అండగా నిలవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని

న్యాయవా దులు వైసిపికి అండగా నిలవాలని స్పీకర్ తమ్మినేని సీతారాం కోరారు. బుధవారం పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాల యంలో న్యాయవాదులను కలిసి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించే దుకు సహకరించాలని వారిని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేసిందన్నారు. గతంలో తాను పట్టణంలో కోర్టు ఏర్పాటుకు కృషి చేశానన్నారు. 45 ఏళ్ల తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో న్యాయవాదులంతా అండగా నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. న్యాయస్థానంలో ఉన్న పలు సమస్యలను, మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమయ్యే పలు అంశాలను తమ్మినేని దృష్టికి న్యాయవాదులు తీసుకొచ్చారు. వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని తమ్మినేని వారికి హామీఇచ్చారు. కార్యక్రమంలో యువ నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్, బొడ్డేపల్లి రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే దాడులు

పొందూరు: ఓటమి భయంతోనే వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రతిపక్షాలు, ప్రత్యర్థులపై దాడులు చేస్తున్నారని టిడిపి అభ్యర్థి రవికుమార్ సోదరుడు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కూన వెంకట సత్య నారాయణ అన్నారు. మండలం తాడివలసలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మజ్జిలిపేటలో కూన ప్రమీల, తాను ఎన్నికల ప్రచారం చేస్తుండడంతో తట్టుకోలేని వైసిపి నాయకులు, కార్యకర్తలు కవ్వింపు చర్యలకు దిగారని, తాము స్పందించక పోవడంతో హత్యాయత్నానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసిపిలో అది నాయకుడు నుంచి కిందిస్థాయి నాయకుల వరకూ దాడుల సంస్కృతికి అలవాడు పడ్డారని ఆరోపించారు. వైసిపి నాయకులు ఎన్ని అడ్డంకులు సృష్టించాలని ప్రయత్నించినా నియోజకవర్గం ప్రజలు టిడిపితోనే ఉన్నారన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్‌లు టి.లక్ష్మణరావు, బొడ్డేపల్లి సత్యం, నాయకులు సన్యాసిరావు, భాస్కరరావు, వరదరాజులు ఉన్నారు.

టిడిపి ముమ్మర ప్రచారం

పొందూరు: మండలంలోని తండ్యాం, తాడివలస, రాపాక, కృష్ణాపురం, సింగూరు, తదితర గ్రామాల్లో బుధవారం టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల, ఆయన సోదరుడు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కూన వెంకట సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్ ఆధ్వర్యంలో ముమ్మర ప్రచారాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బాడాన శేషగిరి నాయుడు, బలగ శంకర భాస్కరరావు, అంబళ్ల శ్రీను, సురేష్, జనసేన నాయకులు కొంచాడ చిన్నం నాయుడు, ముల్లు హరనాథ్, జామాన అప్పల నాయుడు, బాబూరావు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

ఆమదాలవలసను రోల్ మోడల్ చేస్తా..

ప్రజాశక్తి- ఆమదాలవలస

రోల్ మోడల్ నియోజకవర్గంగా ఆమదాలవలసను అభివృద్ధి చేసి చూపిస్తామని జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ అన్నారు. బుధవారం మండలంలోని చిన్న జొన్నవలస, పెద్ద జొన్నవలస, ఆర్ఆర్ కాలనీ, సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస గ్రామాల్లో పొందూరు మాజీ ఎంపిపి సువ్వారి దివ్యతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పోస్టర్లు పంపిణీ చేసి గ్యాస్‌స్టవ్ గుర్తుపై ఓటువేసి స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీని గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజక వర్గంలో గడచిన పదేళ్లలో చెప్పుకోదగ్గ అభివృద్ధి

పోస్టర్లు పంపిణీ చేసి ఓటును అభ్యర్థిస్తున్న సువర్ణ

జరగలేదన్నారు. ప్రధానంగా ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డు పాడై పదేళ్లు కావస్తున్నప్పటికీ నేటికి ఆ రహదారికి మోక్షం కలగలేదన్నారు. చాలా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేక పోయారన్నారు. సువ్వారి అనీల్ కుమార్, వాసురెడ్డి శ్రీను, సీపాన రామస్వామి, ఎండ షణ్ముఖాంజనేయులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న స్ఫూర్తితో ఉద్యమించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

దేశ స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న చరిత్ర శ్రీశయనులకు ఉందని, తెల్లదొరలకు ఎదురొడ్డి నిలబడ్డ సర్దార్ గౌతు లచ్చన్నను ఆదర్శంగా తీసుకుని నేటి నియంత జగన్‌కు వ్యతిరేకంగా శ్రీశయనులంతా సమిష్టిగా పోరాడాలని టిడిపి అభ్యర్థి గొండు శంకర్ పిలుపు నిచ్చారు. నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో శ్రీశయన సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన సోదరుడు డాక్టర్ గొండు గంగాధర్, మరదలు డాక్టర్ హరితతో కలిసి పాల్గొన్న శంకర్ మాట్లాడారు. టిడిపి ఆవిర్భావం నుంచి శ్రీశయన సామాజిక తరగతికి అత్యంత ప్రాధాన్యత నిచ్చిందని గుర్తు చేశారు. గౌతు లచ్చన్న కుటుంబానికి ఇప్పటికీ పార్టీలో చంద్రబాబు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేశారు. వృత్తి నైపుణ్యాన్ని పెంచడంతో పాటు అనేక రకాలైన సంక్షేమ పథకాలను అమలు చేసినట్టు తెలిపారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధికి టిడిపి ఎల్లవేళలా అండగానే ఉంటుందన్నారు. సమస్యలుంటే పరిష్కరించుకునేందుకు సమిష్టిగా కృషిచేసి అన్ని వర్గాలతో సమాన ప్రాధాన్యత సాధించుకుందా మన్నారు. ఈ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అండగా నిలవాలని కోరారు. సమావేశంలో మండల మన్మథరావు, బర్రి మధు, నాయకులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే వైసిపి ధ్యేయం

లావేరు: పేదల అభివృద్ధే వైసిపి ధ్యేయమని, చంద్రబాబు అధికారంలోకి వస్తే ఇప్పుడు జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు అన్ని నిలుపుదల చేస్తారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పెద్దలింగాలవలస, లావేరు పంచాయతీల్లో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. జగన్ పాలన దేశానికే ఆదర్శవంతంగా నిలుస్తోందన్నారు. మళ్ళీ ఓట్లు వేసేటప్పుడు కచ్చితంగా ఫ్యాన్ గుర్తుకే ఓట్లు వేసి వైసిపిని గెలిపించాలని విజ్ఞప్తి చేసారు. ఎంపీ చంద్రశేఖర్ మాట్లాడుతూ పొరపాటున కూడా ప్రతిపక్ష పార్టీలకు ఓట్లువేస్తే సంక్షేమం, అభివృద్ధి, మూడు రాజధానులు నిలిచిపోతాయన్నారు. పేద ప్రజలు అభ్యున్నతే ధ్యేయంగా జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నరని, మళ్ళీ సిఎంగా జగన్మోహన్ రెడ్డి అవ్వడం రాష్ట్రానికి ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఆర్.బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, నడిమింటి కుమారి, మీసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లంఊటలు ధ్వంసం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని సవరకుద్దబలో టెక్కలి ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, పలాస డిటిఎఫ్ సిబ్బంది సంయుక్తంగా సారా తయారీ స్థావరాలపై బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నాటు సారా తయారీ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెబి సిఐ జి.రాజశేఖర్‌నాయుడు, డిటిఎఫ్ సిఐ పి.రామచంద్రకుమార్ పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రానున్న ఎన్నికల్లో టిడిపి ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌లను గెలిపించాలని తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి కోరారు. నియోజక వర్గం పరిధిలోని గార మండలం శ్రీకూర్మంలో ఎం. ప్రభాకరరావు, వి.ఎస్.గిరి, కైబాడి రాజు, గోర సురేష్, కోరాడ వెంకటరావు ఆధ్వర్యాన నిర్వహించిన ప్రజాగళం, బాబు సూపర్ సిక్స్ పథకాల ప్రచార కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ గత అయిదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందలేదుగాని అప్పులు పెరిగాయ న్నారు. చెప్పుకోవడానికి రాజధానిని లేకుండా చేసి, రాజధాని భూములను మాత్రం తాకట్టు పెట్టారని విమర్శించారు.

టిడిపిలో పలువురు చేరిక

పలాస : పలు ప్రాంతాల ప్రచారంలో భాగంగా టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష, నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి సమక్షంలో మందస మండలాలకు చెందిన వైసిపి నాయకులు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరికి వేర్వేరు చోట్ల శిరీష, వెంకటన్న చౌదరిలు టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మందస మండలం మూలిపాడుకు తెంబ దమయంతి, టి.హరిశ్చంద్ర, శాంతి, బి.మోహనరావు, లండ అప్పన్న, వై.భైరాగి, పిట్ట పాపారావు తదితరులు, అలాగే మందస మండలం లోహరబంధ పంచాయతీ నుంచి తాళ్ల జోగేశ్వరరావు, తాళ్ల చలపతి భువనేశ్వరరావు, ధనుంజయరావు, గోవిందరావు, కిషోర్, భైరాగి, సావిత్రి తదితరులు, అదే మండలం సువర్ణపురం పంచాయతీ నుంచి కొవ్వూరు నూకమ్మ, నవ్వుపాడు చిన్న, కొవ్వూరు రామారావు, కొవ్వూరు శివలు టిడిపిలో చేరారు.

కార్మికుల పక్షపాతి కాంగ్రెస్

ప్రజాశక్తి- టెక్కలి

కార్మికుల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ అని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. మండలంలోని పోలవరం, లింగాలవలస, సీతాపురం, తిర్లంగి గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెంటనే చేపట్టబోయే సంక్షేమ పథకాలపై వివరించారు. గ్రామాల్లో పనులు చేస్తున్న ఉపాధి హమీ కూలీలతో మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపడితే ఉపాధి హమీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తుందని అన్నారు. రోజు వారి కూలి రూ.400 అమలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పేడాడ సూర్యనారాయణ, చింతాడ శ్రీనివాసరావు, దీర్ఘాసి వెంకటరావు, కోటిపల్లి గిరి, పి.వి.ఎస్ సరోజని పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న పరమేశ్వరరావు

ప్రచారాల్లో ఫ్యామిలీ సెంటిమెంట్

టెక్కలి : మరికొద్ది రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ప్రధానమైన పార్టీల ప్రచారాలు జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో అభ్యర్థులకు చెందిన ఫ్యామిలీ మెంబర్లు ప్రచారాల్లో పాల్గొవడం సహజం. అయితే టెక్కలి నియోజకవర్గంలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ప్రధాన పార్టీల అభ్యర్థులుగా తలపడుతున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రచారంలో తన కుటుంబ సభ్యులను మొదటిసారిగా భాగస్వామ్యం కావడం గమనార్హం. పోస్టల్ బ్యాలెట్ వినియోగించే క్రమంలో ఉద్యోగులతో అచ్చెన్నాయుడు సతీమణి విజయ మాధవి మాట్లాడి పరోక్షంగా అచ్చెన్నాయుడుకు మద్దతుగా ప్రచారం చేశారు. అదేవిధంగా ఆయన తనయుడు కింజరాపు కృష్ణమోహన్ నాయుడూ తండ్రి తరుపున ప్రచారంలోకి దిగడం ప్రథుం. టెక్కలిలో అమ్మవారి ఆలయం వద్ద ప్రారంభమైన ర్యాలీలో పాల్గొన్న కృష్ణమోహన్ నాయుడు సంతబొమ్మాళి మండలంలో పలు గ్రామాల్లో స్వయంగా పర్యటించి టిడిపి విజయానికి కృషి ప్రచారం చేయడం గమనార్హం. కాగా, అచ్చెన్నాయుడు ప్రచారంలో కుటుంబ సభ్యులు నేరుగా పాల్గొవడం ఇదే ప్రథమమని పలువురు అంటున్నారు.

ఇక ప్రత్యర్థి పార్టీ వైసిపికి చెందిన దువ్వాడ శ్రీనివాస్ కుటుంబ సభ్యులు మాత్రం ప్రచారానికి దూరంగా ఉన్నారు. దువ్వాడ సతీమణి దువ్వాడ వాణి టెక్కలి జడ్‌పిటిసిగా అధికార పార్టీకి చెందిన వారే. కానీ, ఆమె ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండడం గమనార్హం. గతంలో వైసిపి పార్టీ తరుపున చేపట్టిన ప్రచారాల్లోనూ, కార్యక్రమాల్లోనూ ఉమ్మడిగా ప్రచారాలు చేపట్టి, పార్టీ కోసం వాణి, వారి పెద్ద కుమార్తె హైందవి ప్రచారాల్లో పాల్గొనేవారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ కిల్లి కృపారాణికి తోడుగా ఆమె భర్త రామ్మోహనరావు ప్రచారంలో భాగస్వామ్యం అవుతూ వేర్వేరుగా ప్రచారం చేపడుతున్నారు. ఏదేమైనా ప్రచారాల పర్వంలో అభ్య ర్థుల విజయానికి సహకరించేందుకు వారి కుటుంబ సభ్యులూ రంగంలోకి దిగారు.

రోడ్ షోలో మాట్లాడుతున్న రామ్మోహన్ నాయుడు

వైసిపిది అరాచక పాలన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

రాష్ట్రంలో ఐదేళ్లుగా సాగుతున్న అరాచక పాలనకు సమరగీతం పాడాలని, అధోగతి పాలైన రాష్ట్రాన్ని తిరిగి పునర్నించుకోవలసిన అవసరం ఏర్పడిందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని సుందరాడ, పెద్దపద్మాపురం, మెళియాపుట్టి, చాపర, పట్టుపురం, జాడుపల్లి, తూముకొండ, చీపురుపల్లి, మురికింటిభద్ర, ముక్తాపురం, కరజాడ, చిన్నహంస, గోకర్ణపురం, గొప్పిలి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రోడ్ షో నిర్వహించారు. అన్ని కూడళ్లలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. చంద్రబాబును సిఎం చేయడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. టిడిపి ప్రభుత్వం రాగానే ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులను పూర్తిచేసేలా కృషి చేస్తామని హామీనిచ్చారు. వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నియోజవర్గ జనసేన ఇన్‌ఛార్జి గేదెల చైతన్య, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సలాన శరత్‌కుమార్, మాజీ ఎంపిపి సలాన మోహనరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్ గౌడ, టిడిపి మండల మాజీ అధ్యక్షులు అనపాన రాజశేఖర్‌రెడ్డి, టిడిపి మహిళా జిల్లా ఉపాధ్యక్షులు బూర్ల లలిత కుమారి, తెలుగు యువత మండల అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, నంబాల వెంకటరావు, కదంబల పైడిరాజు, అగ్గాల శ్రీనివాసరావు, చాపర మాధవరావు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చుతా

ప్రజాశక్తి- పలాస

తనకు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తానని, ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను తప్పకుండా నేరవేర్చుతానని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 23 వార్డు, మందస మండలం మూలిపాడు, శ్రీనివాసపురం, గోపాలపురం, సొండిపూడి, కొత్తపల్లి, ముకుందపురం రాంపురం, గంగువాడ గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి సీదిరి అప్పలరాజు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీని ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. విస్తరణ పనుల్లో వ్యాపారులకు ఇస్తామన్న టిడిఆర్ ఇవ్వలేక పోయారన్నారు. పలాసలో వైసిపి నాయకుల భూ కబ్జాలు, దౌర్జన్యాలు విపరీతంగా పెరిగిపోయాయని ఆరోపించారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో డిఫెన్స్ అకాడమీ, సిల్క్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. జీడి రైతులకు అండగా ఉంటామని, జీడికి గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీఇచ్చారు. పలాస ఇచ్ఛాపురం నియోజక వర్గాల మధ్య జీడి, కొబ్బరి పంటలకు బోర్డులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. మందస మండలంలో డబారసింగ్, కళింగధల్, దామోదర సాగర్‌లకు వైసిపి ప్రభుత్వంలో ఆధునికీకరణ పనులు కూడా చేయకపోవడంతో పంట భూములకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే పలాస నియోజకవర్గంలోని అన్నీ సమస్యలను పరిష్కరించి ప్రజలకు సుపరిపాలన అందిస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, వజ్జ గంగాభవాని, గూన మన్మథరావు, సంతోష్‌కుమార్ పండా పాల్గొన్నారు.

ప్రచారంలో మాట్లాడుతున్న గౌతు శిరీష

గతంలో ఎన్నికల ప్రచారానికి వచ్చే మంత్రులైన, ముఖ్యమంత్రులైనా, కేంద్ర మంత్రులైన ముందుగానే స్థానికంగా ఉండే సమస్యలను తెలుసుకుని, తాము మళ్లీ అధికారంలోకి వస్తే ఆ సమస్యలు పరిష్కరిస్తామని, ఆయా వర్గాలకు అండగా ఉంటామని ప్రచార సభల్లో హామీలు ఇచ్చి ఆయా రంగాలకు అండగా ఉంటామని చెప్పేవారు. కానీ, ప్రస్తుతం అన్ని పార్టీల నాయకులు తమ ప్రత్యర్థులను ఎంత తిడితే అంత మైలేజ్ వస్తుందన్న ధరణిలో వ్యవహరిస్తున్నారు. చివరికి ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తులూ తమ సభలకు ఎన్నో ఆశలు, మరెన్నో ఆకాంక్షలతో వచ్చే ప్రజానీకానికి సంతృప్తిపరిచే అంశాలు ఏంటో తెలుసుకోలేకపోవడం శోచనీయం.

స్థానిక సమస్యల ప్రస్తావన ఏదీ?

- జీడి మద్దతు ధర, సాగునీరు ఊసే లేదు
- బెంతులకు దొరకని అవకాశం
- కలగా మిగిలిన కొబ్బరి పార్కు
- నిరాశపరిచిన సిఎం సభ

ప్రజాశక్తి- కవిటి

ఇచ్ఛాపురం నడిబొడ్డులో మంగళవారం జరిగిన వైసిపి సిద్ధం సభ అదే కోవలోకి వస్తోంది. స్థానిక వైసిపి నాయకులు తమకు ఎంతో మేలు చేస్తుందని ఆశించిన ముఖ్యమంత్రి సిద్ధం సభ ముఖ్యమైన అంశాలు విస్మరించడంతో కీడు చేసేలా కనిపిస్తోంది. ముఖ్యంగా ఏడాదికి పైగా మద్దతు ధర కోసం పోరాడుతున్న జీడి రైతులు, వంశధార ద్వారా నియోజకవర్గ అంచుల వరకు సాగునీరు అందించాలని పోరాడుతున్న రైతు సంఘాలు, వంశధార సాధనా కమిటీ, తమ మనుగడ కోసం నాలుగు నెలలుగా దీక్షలు చేస్తున్న బెంతు ఒరియాలు, ఎన్నో ఏళ్ల నుంచి ప్రచారానికే పరిమితమవుతున్న కొబ్బరి పార్కు వంటి ముఖ్యమైన అంశాలు ముఖ్యమంత్రి ప్రసంగంలో లేకపోవడం స్పష్టమైన లోపంగా కనిపిస్తోంది. కనీసం స్థానిక ప్రజా ప్రతినిధులైనా ఈ సమస్యలపై ముఖ్యమంత్రికి అవగాహన కల్పించి ఉంటే బాగుండేదని దిగువ శ్రేణి నాయకులు వాపోతున్నారు.

జీడికి దక్కని మద్దతు

జీడిపిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ లక్షమంది రైతులు సంతకాలు చేసి గతేడాది డిసెంబరులో స్వయంగా ముఖ్యమంత్రికి అందించారు జీడి రైతుల సంఘం నాయకులు. ఆ తరువాత ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లి స్వయంగా తమ సమస్య వివరించారు. మేనిఫెస్టోలో అయినా జీడి రైతుకు మద్దతు లభిస్తుందని ఆశిస్తే అక్కడా వీరికి నిరాశే మిగిలింది. చివరికి ఇచ్ఛాపురంలో అయినా జీడి రైతులకు తీపి కబురు అందిస్తారంటే కనీసం ఆ ప్రస్తావనే ముఖ్యమంత్రి తీసుకురాలేదు. దీంతో కొన్ని వేల కుటుంబాలకు ఆధారమైన పంటపై, దాని కోసం పోరాడుతున్న తమపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై రైతులు, రైతు సంఘాల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఓట్లు అడగడానికి వస్తున్న వారికి తమ పాట్లు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంకెన్నాళ్లు వివక్ష

ఇచ్ఛాపురం నియోజకవర్గం రైతాంగం సాగునీటి పంపిణీలో ఇంకెన్నాళ్లు వివక్ష ఎదుర్కోవాలని, ఎప్పటికి ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందిస్తారని ప్రశ్నిస్తూ... నియోజకవర్గంలోని రైతు కుల సంఘం నాయకులు గతకొద్ది నెలలుగా పోరాడుతున్నారు. ఈసారి సాగునీటిపై స్పష్టమైన హామీ ఇచ్చిన పార్టీనే ఆదరిస్తామని కూడా చెప్పారు. అంతేకాకుండా నియోజకవర్గంలోని ప్రతి సెంటుకూ సాగునీరు అందించాలనే లక్ష్యంతో వంశధార సాధన కమిటీ ఏర్పాటు చేసి నియోజకవర్గ వ్యాప్తంగా అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నారు. వంశధార నదీ జలాలు పూర్తిస్థాయిలో వినియోగిస్తే ఇచ్ఛాపురం చివరి వరకు సాగునీటికి కొరత ఉండదని, ముఖ్యంగా నేరడీ బ్యారేజ్ సమస్యలు తొలగిపోతే ఇది సాధ్యమవుతుందని సాధన కమిటీ సభ్యులు, రైతులు అంటున్నారు. దీని సాధనకై ఇటీవల పలాస వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి వినతి పత్రం కూడా అందించారు. మంగళవారం జరిగిన సిద్ధం సభలో కూడా వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ మాట్లాడుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గానికి సాగునీరు అందితే రైతుల జీవితాలు బాగుపడతాయని, అది ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని అన్నారు. ఇచ్ఛాపురం రైతాంగానికి సాగునీరు అందించి మేలు చేయాలని కోరారు. ఆ తరువాత ప్రసంగించిన ముఖ్యమంత్రి మాత్రం కేవలం బటన్ నొక్కడం, చంద్రబాబును తిట్టడంతోనే ప్రసంగం ముగించేశారు. దీనిపై రైతాంగంలో పూర్తిస్థాయిలో అసంతృప్తి కనిపిస్తోంది.

సిద్ధం సభలో ప్లకార్డు చూపిస్తున్న బెంతు ఒరియాలు

బెంతు ఒరియాల ఆగ్రహం

మరోవైపు తరగతి ధ్రువీకరణ పత్రాల కోసం నాలుగు నెలలుగా దీక్షలు చేస్తూ పోరాడుతున్న బెంతు ఒరియాలు ముఖ్యమంత్రికి వినతిపత్రం అందించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీనికోసం ముందుగా స్థానిక నాయకులను కలిసి తమకు ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందించే అవకాశం కల్పించాలని వేడుకున్నా ఫలితం లేకపోయిందని వారు వాపోతున్నారు. నాలుగు నెలలుగా తాము దీక్షలు చేస్తున్నా అన్ని తరగతి ప్రజలు, నాయకులు సంఘీభావం తెలిపారని, కేవలం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మాత్రమే రాలేదని వారు అంటున్నారు. గతంలో కనీసం నేటివిటి ధ్రువపత్రమైనా వచ్చేదని, ప్రస్తుతం అదీ రావడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చివరికి ఎన్నికల ముందు వచ్చిన ముఖ్యమంత్రి కూడా అందరిలానే వ్యవహరించి తమ సమస్య గుర్తించలేదని వారు రగిలిపోతున్నారు. దీంతో సమావేశమై దీనిపై ఒక నిర్ణయం తీసుకునేందుకు 'సిద్ధం' అవుతున్నారు.

ప్రచారానికే పరిమితం

కొన్ని దశాబ్దాలుగా ఉద్దానం కొబ్బరి రైతును ఊరిస్తున్న అంశం కొబ్బరి పార్కు. ఈ అంశం తెరపైకి వచ్చినప్పుడల్లా అదిగో పార్క్.. ఇదిగో అనుమతులు అంటూ నాయకులు హడావుడి చేస్తున్నారు. అలాగే ఐదేళ్లకోసారి ఎన్నికల కూడా జరిగిపోతున్నాయి. అధికారాలు, అధికారులు మారిపోతున్నారు. కానీ, ఉద్దానం కొబ్బరి రైతాంగంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న కొబ్బరి రైతుల ఆయువుపట్టు కొబ్బరి పార్కు మాత్రం కలగానే మిగులుతోంది. కనీసం ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి వస్తుండడంతో కొబ్బరి పార్కు ఏర్పాటుపై కీలక ప్రకటన చేస్తారని జిల్లాలోని కొబ్బరి రైతాంగం ఎదురు చూసింది. కానీ, వారికి మళ్లీ నిరాశే ఎదురైంది.

చివరికి చేయూత, విద్యా దీవెన పథకాలు వేసేందుకు చంద్రబాబు అడ్డుకుంటున్నారన్న మాట కూడా ప్రజలను ఆకట్టుకోలేకపోయింది. విద్యా దీవెన పథకం నాలుగు విడతల్లో రావాల్సి ఉండగా, ఇప్పటి వరకూ ఒక్క విడత కూడా విడుదల చేయలేదు. ఇక ఎప్పుడో సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో విడుదల చేయాల్సిన చేయూత పథకం నిధులకు మార్చిలో బటన్ నొక్కి ఇప్పటి వరకు చోద్యం చూశారు. తీరా ఎన్నికలు మరో వారం ఉన్నాయనగా డబ్బులు వేస్తామంటే ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయనే ఆరోపణ కూడా విమర్శలకు తావిస్తోంది.

జీడి రైతులపై నిర్లక్ష్య వైఖరి

ప్రభుత్వం జీడి రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తోంది. జీడికి మద్దతు ధర కల్పించాలని కోరుతూ ఏడాదికి పైగా పోరాడుతున్నాం. గతేడాది డిసెంబరులో లక్షమంది రైతులు సంతకాలు చేసి ముఖ్యమంత్రికి స్వయంగా అందించాం. కవిటిలో కొబ్బరి పార్కు కానీ, పలాసలో జీడి బోర్డు ప్రస్తావన కానీ, ఇచ్ఛాపురం రైతులకు సాగునీరు వంటి అంశాల ప్రస్తావనే లేదు. కేవలం ప్రచారానికే రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న వైసిపి రైతులకు చేసింది, చేసేది ఏదీ లేదని మరోసారి స్పష్టమైంది.

- తెప్పల అజయ్ కుమార్, జిల్లా కన్వీనర్, జీడి రైతుల సంఘం

బెంతులతో బంతులాట

ప్రస్తుత రాజకీయ పార్టీలు బెంతు ఒరియాలతో బంతులాట ఆడుకుంటున్నాయి. తరగతి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరుతూ నాలుగు నెలలుగా మేము దీక్షలు చేస్తున్నాం. మా బిడ్డల భవిష్యత్, మా భవిష్యత్ కోసం పోరాడుతున్నాం. తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో మా పిల్లలు చదువుకోలేక పోతున్నారు. మా యువత ఉద్యోగాలు కోల్పోతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మా దగ్గరకు వచ్చిన సిఎంని కలిసి మా సమస్య చెప్పుకోవాలని చూశాం. మాకు అవకాశం దొరకలేదు. వచ్చే ఎన్నికల్లో తప్పకుండా మూల్యం చెల్లించుకోవలసి ఉంటుంది.

- సుమన్ బిసాయి, బెంతు ఒరియాల యూత్ అధ్యక్షులు, వరక

ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్

అశోక్‌కు అడుగడుగునా నీరాజనం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మండలంలో బొడ్డకళ్లి, హరిపురం, కొలిగాం, కీర్తిపురం, పాయతారు పంచాయతీల్లో టిడిపి అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం గ్రామాల్లో అడుగు పెట్టిన వెంటనే ప్రజలు హారతులు, పువ్వుల వర్షంతో ఘన స్వాగతం పలికారు.

ఎన్నికల తేదీ దగ్గర పడ్డాయని, ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా అఖండ మెజారిటీతో టిడిపిని గెలిపించాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందని అశోక్ అన్నారు. టిడిపి అధికారంలో వస్తే చేపట్టే సంక్షేమ పథకాలు, సూపర్ సిక్స్ పథకాలు గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు దక్కత ఢిల్లీరావు, మేరుగు సూర్యనారాయణరెడ్డి, బుద్దాల నిర్మలారెడ్డి, భోజరాజురెడ్డి, సహదేవ్‌రెడ్డి, దక్కత రామారావు పాల్గొన్నారు.

పలాసలో పెరిగిన భూ కబ్జాలు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో అభివృద్ధి కంటే భూకబ్జాలు పెరిగిపోయాయని ఇండియా ఫోరం ఎమ్మెల్యే అభ్యర్థి మజ్జి త్రినాథ్‌బాబు ఆరోపించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ వరిధిలో కాశీబుగ్గ, మందస పట్టణ ప్రాంతాల్లో బుధవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పది రోజులకు ఒకసారైనా తాగునీరు సరఫరా చేయకపోవడం దారుణమని అన్నారు. తనకు ఒక్క అవకాశమిస్తే పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వైసిపి హయాంలో గిరిజన గ్రామాల్లో కనీస వసతులు కూడా కల్పించలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను, ఎంపీ అభ్యర్థి పేడాడ పరమేశ్వరరావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కొర్ల హేమారావు చౌదరి, విశ్వనాథం, బాబూరావు, గణపతి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న త్రినాథ్‌బాబు

చంద్రబాబు మానసపుత్రిక టిడ్కో కాలనీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

పాత్రునివలస సమీపంలోని ఎపి టిడ్కో కాలనీలో టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డి గిరిజా శంకర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రజాగళం కార్యక్రమంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ పాల్గొన్నారు. కాలనీకి విచ్చేసిన ఆయనకు మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. కాలనీలో పర్యటించిన ఆయన దృష్టికి కాలనీ వాసులు పలు సమస్యలను తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అన్నా క్యాంటీన్, టిడ్కో కాలనీలు చంద్రబాబు మానస పుత్రికలుగా పేర్కొన్నారు. అందువల్లనే ఇళ్లు పూర్తయినా తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించడంలో తాత్సరం చేశారన్నారు. గతేడాది తాను ధర్నా చేయడంతో ఆఘమేఘాల మీద ఇళ్లు అప్పగించారని గుర్తు చేసారు. భవనాలకు రంగులు వేయడంలో వున్న చిత్తశుద్ధి భవనాలపై, కాలనీపై లేదన్నారు. కాలనీకి కూతవేటు దూరంలో వున్న ధర్మానకు కాలనీవాసుల కష్టాలు తెలియవా అని ప్రశ్నించారు. కాలనీలో సమస్యలు పరిష్కరించి, నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేస్తామని, ప్రహరీ గోడను నిర్మిస్తామని, రేషన్ డిపో, సచివాలయాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. మహిళల ఉపాధి కోసం స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ నెలకొల్పుతామని, అంగన్వాడీ స్కూల్, పార్క్ అభివృద్ధి, స్థానికుల సహకారంతో గుడి ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఎంపీ లాడ్స్ నిధులతో బస్టాండ్, లైటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. తాను ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన నెలరోజుల్లో ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పిస్తానని హామీనిచ్చారు. ఎంపీగా రామ్మోహన్ నాయుడును, ఎమ్మెల్యేగా తనను సైకిల్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పాత్రునివలస, చాపురం పంచాయితీ నాయకులు, కాలనీ కమిటీ సభ్యులు, టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారంలో మాట్లాడుతున్న గొండు శంకర్

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం వైసిపి అసెంబ్లీ అభ్యర్థి రెడ్డి శాంతికి జన నీరాజనాలు పలుకుతున్నారు. మండల కేంద్రంలోని అచ్యుతాపురం కూడలి నుంచి కోర్టు కూడలి వరకు బుధవారం రోడ్డు షోను నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రోడ్ షోకు పెద్దఎత్తున ప్రజలు, అభిమానులు, పదివేల మంది మహిళలు పాల్గొని రెడ్డి శాంతి వెంటే మేము సిద్ధమంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందించిన వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. వచ్చే ఎన్నికలు మంచికి, చెడుకి, పేదలకు, పెత్తందారులకు జరుగుతున్న ఎన్నికలని అన్నారు. మీరంతా పేదలకు మేలు చేసే జగనన్నకు తోడుగా నిలిచి ఓటుతో మద్దతు తెలపాలని కోరారు. కూటమిగా వస్తున్న టిడిపికి ఓటు వేస్తే జన్మభూమి కమిటీలకు ఓటు వేసినట్లేనని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు.

రోడ్ షో నిర్వహిస్తున్న రెడ్డి శాంతి

వికలాంగులు, వృద్ధులకు వాహన సౌకర్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వికలాంగుల, వృద్ధ ఓటర్లకు ఇసి ప్రత్యేకంగా సాక్షం యాప్‌ను ప్రవేశపెట్టింది. ఓట్లు వేయడానికి వెళ్లే వికలాంగులు, వృద్ధులు తమ ఫోన్లలో సాక్షం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పేర్లు నమోదు చేసుకున్న వారిని ఇంటి నుంచి పోలింగ్ కేంద్రానికి చేర వేస్తారు. యాప్‌లో ఓటర్లు పేర్లు నమోదు చేయగానే వారి పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుస్తాయి. ఇంటి నుంచి పోలింగ్ కేంద్రానికి వెళ్లి రావడానికి వాహనం కోసం యాప్‌లో అభ్యర్థించవచ్చు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద 13న మూడు చక్రాల సైకిల్ అందుబాటులో ఉంచుతారు. ఓటు వేసే సమయంలో ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సహాయం అందిస్తారు. నేరుగా ఎన్నికల సంఘమే ఈ సౌకర్యాలను అందుబాటులో ఉంచుతోంది. జిల్లాలోని ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఇప్పటికే ఈ సేవల కోసం సిద్ధం చేసింది.

నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రచారం చేస్తున్న నరసింహమూర్తి

ప్రజాశక్తి- పోలాకి

నరసన్నపేట నియోజకవర్గంలోని సమస్యలను శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని ఇండియా ఫోరం ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి నరసింహమూర్తి తెలిపారు. నరసన్నపేటలోని బండివీధి, ఆదివారంపేట, పోలాకి మండలం సంతలక్ష్మీపురం, తలసముద్రం గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేసే అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నరసన్నపేటలో డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా పాడైందని, దానివల్ల పట్టణ ప్రజలు దోమలతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే డ్రెయినేజీ వ్యవస్థను ప్రక్షాళన చేసి సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

అభివృద్ధి చేసే ఓటు అడుగుతున్నా...

బూర్జ : ప్రచారం చేస్తున్న తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి- బూర్జ

తన ఐదేళ్ల పదవీకాలంలో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన తనకే ఓటు అడిగే హక్కు ఉందని, ప్రజలు గమనించి తనకు మద్దతు ప్రకటించాలని స్పీకర్, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం కోరారు. బుధవారం మండలంలోని జంగాలపేట, ఉప్పినవలస, ఎబిసి పేట, సింగన్నపాలెం, ఓబులిపేట, ఉప్పాడ వెంకంపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి దేశంలో ఇంతవరకు ఎవరూ అమలు చేయని ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. మళ్లీ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువవుతాయన్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమితో ప్రజలకు ఒరిగేది ఏమీ లేదన్నారు. కేవలం దొంగ మేనిఫెస్టోలతో ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. ప్రజలు వాస్తవాలను గ్రహించి ఐదేళ్ల పాలనలో ప్రతి ఇంటికి చేరువైన పథకాలను గమనించి ఓటువేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి కరెన్న దీప, ఎంపిపి ప్రతినిధి నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి రామారావు, మండల పార్టీ అధ్యక్షులు గోవిందరావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుమ్మడి రాంబాబు, వైస్ ఎంపిపిలు కృష్ణం నాయుడు, బి.సూర్యారావు, పిఎసిఎస్ అధ్యక్షులు నారాయణమూర్తి కార్యకర్తలు పాల్గొన్నారు.

పొందూరు: రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైసిపి ఎంపీ అభ్యర్థి పేడాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం అన్నారు. బుధవారం పట్టణంలో రోడ్డుషో కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులను చేశామన్నారు. మరింత అభివృద్ధి చేసేందుకు తమకు మరో అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ దుంపల లక్ష్మణరావు (రామారావు), జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్, సర్పంచ్ రేగడి లక్ష్మి, ఎంపిటిసి వడగా పద్మావతి, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి ఛైర్మన్ బాడాన సునీల్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, వైసిపి మండల జెసిఎస్ వెంకట కృష్ణారావు, జైప్రతాప్ కుమార్, గోవిందరావు పాల్గొన్నారు.

చాపురంలో సిపిఎం ప్రచారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

శ్రీకాకుళం మున్సిపాలిటీ చాపురం విలీన పంచాయతీలో ఇండియా వేదిక తరుపున గురువారం సిపిఎం విస్తృతంగా ప్రచారం చేపట్టింది. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అంబటి కృష్ణారావును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి బిజెపి చేసిన అన్యాయం, వైసిపి, టిడిపి, జనసేన వారికి వంతపాడుతున్న విషయాన్ని వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇండియా వేదికే ప్రత్యామ్నాయమని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి పదేళ్ల ప్రత్యేక హోదా ఇస్తామని హామి ఇచ్చిందని, ఇండియా వేదిక తరుపున పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, పార్టీ నాయకులు కె.శ్రీనివాస్, ఎన్.ప్రభాకర్, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న శ్రీశ్రావ్య

వైసిపి పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వైసిపి పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు సతీమణి శ్రీ శ్రావ్య పేర్కొన్నారు. నగర పరిధిలో మండల వీధి, గూనపాలెం పరిసర ప్రాంతాల్లో టిడిపి నాయకులు కొర్ను నాగార్జున ప్రతాప్, కోరాడ హరగోపాల్, పిరియా మాధవి ఆధ్వర్యాన నిర్వహించిన ప్రజాగళం బాబు సూపర్ సిక్స్ పథకాల ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ మరదలు డాక్టర్ సి.హెచ్ హరితతో కలిసి ఆమె పాల్గొన్నారు. టిడిపి నాయకులతో కలిసి విస్తృతంగా పర్యటించిన వారు సూపర్ సిక్స్ పథకాలను, మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయిపోయాయన్నారు. మళ్లీ బాబు సిఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెంద తుందన్నారు. రానున్న ఎన్నికల్లో రామ్మోహన్ నాయుడు, గొండు శంకర్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల ఇన్‌ఛార్జిలు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యూబ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రపంచ తలసీమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని డేఅండ్ నైట్ జంక్షన్లో ఉన్న న్యూ బ్లడ్ బ్యాంక్‌లో రామ్స్ ఫౌండేషన్ అధ్యక్షులు ఎం.రాజు ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. బుధవారం జరిగిన ఈశిబిరాన్ని మణికంఠ ప్రారంభించారు. తలసేమియా బాధితుల కోసం నిరంతరాయంగా రక్తం అందిస్తున్నట్లు తెలిపారు. వారికి దాతల సహకారంతో బాధితులకు ప్రతినెల పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. ఈ వ్యాధి రాకుండా ప్రజల్లో అవగాహన శిబిరాలను నిర్వహిస్తున్నామని, స్వచ్ఛంద సంస్థల సహకారంతోనే ఇది సాధ్యమవు తోందన్నారు. రామ్ ఫౌండేషన్ అధ్యక్షులు రాజు మాట్లాడుతూ తలసీమియాతో బాధపడుతున్న చిన్నారులకు తరచూ రక్తం ఇస్తున్నామని, అలాగే రక్తదాతల్లో అవగాహన కల్పించి ఎక్కువ మంది రక్తదానం చేసేందుకు కృషి చేస్తున్నా మన్నారు. ఈ శిబిరంలో డోనర్స్ కె.మోహన్ కృష్ణ, పి.వంశీ, కె.పవన్‌తో పాటు జెసిఐ అధ్యక్షులు మణిశర్మ, గాలి బాబు, బరాటం సంతోష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

టిడిపిలో చేరికలు

కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని విశాఖ ఎ కాలనీలోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ సమక్షంలో పలువురు టిడిపిలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నగరంలోని పెదపాడుకు చెందిన కలగ అప్పారావు, కలగ తిరుమలరావు, ఈరి అప్పారావు, దమ్మలవీధికి చెందిన పట్నాన రాము, కోరాడ శ్రీను, దొక్కల సూర్యనారాయణ, హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన రుప్ప రామారావు, ఎం.అర్జునరావు, పొందర వీధికి చెందిన పలువురు యువకులు కుటుంబాలతో కలిసి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఎటు చూసినా రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. పదిలోడ్ల కాంక్రీట్ వేస్తే పూర్తయ్యే పనులను కూడా పాలకులు విస్మరించారన్నారు. పేరుకే మంత్రిగా ఉన్నా తన చేతిలో ఏమీ లేదని చెప్పుకున్న ధర్మాన ప్రజల సమస్యలను గాలికొదిలేశారని విమర్శించారు. తనను ఆశీర్వదించి ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గ సమస్యలు పరిష్కరించి, మౌలిక సదుపాయాలను కల్పిస్తానన్నారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి అప్పలనాయుడు

అందరికీ అందుబాటులో ఉంటా

ప్రజాశక్తి- లావేరు

వైసిపి కుల రాజకీయాలు చేసి లబ్ది పొందాలని చూస్తుందని విజయనగరం పార్లమెంట్ టిడిపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. బుధవారం లావేరు మండలంలోని సుభద్రపురంలో టిడిపి, జనసేన, బిజెపితో ఆత్మీయ సమావేశం టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ ఓటమి భయం పట్టుకున్న వైసిపి ఎన్నికల్లో లబ్ది పొందేందుకు కులాలతో ఓట్లు రాజకీయం చేస్తుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి నడుకుదుటి ఈశ్వరరావును, ఎంపీగా తనను గెలిపించాలని కోరారు. టిడిపి నియోజకవర్గ పరిశీలకులు త్రిమూర్తులు రాజు మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి భారీ మెజారిటీతో గెలుపించుకోవాలని కోరారు. ఉత్తరాంధ్ర జిల్లాల పార్టీ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైసిపి ఓటమి అంచున కొట్టుమిట్టాడుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మాజీ జిల్లా అధ్యక్షుడు చౌదరి బాబ్జి, ఎచ్చెర్ల ఎఎంసి ఛైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ ఎంపిపిలు మీసాల వెంకటరమణ, డిజిఎం ఆనందరావు, వెంకటేశ్వరరావు, జోగిరాజు, మౌళి, పిన్నింటి మధుబాబు, బెండి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

వైసిపిని మరోసారి గెలిపించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాను సర్వతోముఖాభివృద్ధి సాధించడంలో కీలకంగా ఉన్న రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును మరోసారి గెలిపించి అభివృద్ధిని కొనసాగించేందుకు తోడ్పాటు అందించాలని వైసిపి నాయకులు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు అన్నారు. బుధవారం వైసిపి ఎన్నికల ప్రచారంలో భాగంగా గార మండలం తూలుగులో ఉపాధిహామీ పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడారు. గడచిన ఐదేళ్లలో అవినీతిలేకుండా, ఎవరిని ఆశ్రయించకుండా సంక్షేమ పథకాలను ఇంటివద్దకే అందించిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో స్కూల్ భవనాలు నాడు-నేడు కింద రూపు రేఖలు మార్చుకున్నాయని, ప్రభుత్వ శాఖలకు సొంత కార్యాలయాలు నెలకొల్పి గ్రామస్థాయిలో పాలన అందించడం జరుగు తోందన్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ధర్మాన ప్రసాదరావును, ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో గార మండల వైసిపి నాయకులు, తూలుగు గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామ్‌మనోహర్ నాయుడు

వైసిపితోనే కళింగులకు సముచిత స్థానం

కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రామారావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో కళింగ సామాజిక తరగతికి 70 ఏళ్లలో లేని ప్రాధాన్యతను జగన్మోహన్ రెడ్డి కల్పించారని, ఈ ఎన్నికల్లో ఆయనకు సామాజిక తరగతి పూర్తి సహకారాన్ని అందించాలని కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ దుంపల రామారావు కోరారు. నగరంలోని ప్రైవేటు హోటల్‌లో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. జిల్లాలో కాళింగ సామాజిక తరగతి బలాన్ని గుర్తించి జిల్లాలో ప్రస్తుతం ఒక ఎంపీ, ముగ్గురు ఎమ్మెల్యే అభ్యర్థులకు వైసిపి పోటీకి అవకాశం కల్పించిందన్నారు. 2019లో ముగ్గురు ఎమ్మెల్యే అభ్యర్థులకు, ఎంపీ అభ్యర్థికి అవకాశ మిచ్చారన్నారు. అలాగే ఎమ్మెల్సీ, జిల్లా పరిషత్ ఛైర్పర్సన్, రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ ఛైర్మన్ పదవులిచ్చి సముచిత ప్రాధాన్యత కల్పించారన్నారు. గత ఎన్నికల్లో విజయాన్ని అందుకున్న తమ్మినేని సీతారాంకు అత్యున్నత స్థానం కల్పించి స్పీకర్‌గా అవకాశ మిచ్చారన్నారు. బిసి, ఎస్‌సి,

మాట్లాడుతున్న రామారావు

ఎస్‌టి, మైనారిటీలకు రాజ్యాధికారంలో ప్రాధాన్యత కల్పించి సామాజిక న్యాయాన్ని అందించారన్నారు. ప్రజల్లో ఉండి పదవులు దక్కించుకోలేని వారికి రాజ్యసభ, ఎమ్మెల్సీ స్థానాల్లో నియమించి వారి ఉన్నతిని కోరారన్నారు. మేనిఫెస్టోలో అమలు చేయదగ్గ హామీలు ఇచ్చి ఐదేళ్లలో 99 శాతం పూర్తి చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు బాడాన కృష్ణారావు, పప్పల రాధాకృష్ణ, తమ్మినేని మురళి, తమ్మినేని వాసు దేవరావు, బొడ్డేపల్లి గంగాధర్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న రవికుమార్

ఒక్కఛాన్స్‌తో రాష్ట్రం సర్వనాశనం

ప్రజాశక్తి- ఆమదాలవలస

జగన్ మోహన్ రెడ్డికి ఒక్కఛాన్స్ ఇస్తే రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం చేసాడని టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మునగవలస, ధన్నానపేట, మండాది, ఈసర్లపేట, శ్రీనివాసాచార్యులపేట, అక్కుల పేట, చింతలపేట, బొబ్బిలిపేట, కలివరం, ముద్దాడ పేట, పీరుసాహెబ్ పేట, దూసిపేట తదితర గ్రామాల్లో శంఖారావం కార్యక్రమంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్కఛాన్స్ ఇచ్చి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేసారు. 540 ఇసుక రీచ్‌ల నుంచి రూ.లక్షా 75 వేల కోట్లు దోచుకున్నారని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చెప్పిందని అన్నారు. చంద్రబాబు దళితులకు ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా రుణాలు, విద్యార్థులకు రూ.20 లక్షలు విదేశీ విద్యకు మంజూరు చేసి వారి ఉన్నతికి కృషి చేసారని గుర్తు చేసారు. ఎస్‌సి బ్యాక్ లాగ్ పోస్టులను ఈ ప్రభుత్వం భర్తీ చేయకుండా వారికి తీవ్ర అన్యాయం చేసారని మండిపడ్డారు. ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి దళితులకు జగన్మోహన్ రెడ్డి తీవ్ర అన్యాయం చేసాడని దుయ్యబట్టారు. చేనేత కార్మికుల కోసం 50 సంవత్సరాలకే పింఛన్ మంజూరు చేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో శాసనసభ్యునిగా పోటీ చేస్తున్న తనకు, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కింజరాపు రామ్మోహన్ నాయుడుకు సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాత్రుని పాపారావు, పేడాడ సూరప్ప నాయుడు, తమ్మినేని చంద్రశేఖర్, సుజాత, బగాది రామి నాయుడు, బొడ్డేపల్లి గోరీపతి, లక్ష్మీనారాయణ, నేతింటి జ్యోతి, గొండు రమణ, నూక రాజు, సనపల ఢిల్లేశ్వరరావు, తమ్మినేని అమర్నాథ్, కంచరాన లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న చక్రవర్తిరెడ్డి

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కావాలంటే అదీ కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాసుపత్రి చక్రవర్తిరెడ్డి అన్నారు. మండలంలోని కొలిగాం, కీర్తిపురం, పాయితారి, బొడ్డబడ పంచాయతీల్లో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే చట్టం చేశారని వివరించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ 9 గ్యారెంటీలను వివరించి, హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. పెద్దగా హంగు, ఆర్భాటం లేకుండా సాదాసీదాగా ప్రచారం చేస్తూ ప్రజలను కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాపారావు, లొపింటి దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న శ్రీనివాస్

జగన్‌తోనే సంక్షేమం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

సంక్షేమ పథకాలు అమలు సిఎం జగన్‌తోనే సాధ్యమని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని లింగాలవలస, పోలవరం, రాధావల్లపు రం, తిర్లంగి, సీతాపురం, మేఘవరం గ్రామాల్లో బుధవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌లను గెలిపించాలని కోరారు. అనంతరం మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైసిపికే దక్కిందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే వైసిపి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు కిల్లి అజయ్‌కుమార్, శిగిలిపల్లి మోహనరావు, దవళ కృష్ణారావు, రోణంకి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకన్న చౌదరి

గౌతు శిరీషను గెలిపించాలి

ప్రజాశక్తి- పలాస

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీషకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని ఆమె భర్త, టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి కోరారు. ఈ మేరకు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ రోటరీనగర్‌లో మార్కండేయ పద్మశాలి సంఘం సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన సతీమణి గౌతు శిరీషకు వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని, పద్మశాలి సంఘానికి మా వంతుగా నిరంతరం అండదండలు అందిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్షులు ఎం.శివ, సంఘం సభ్యులు ఆర్.శంకరరావు, ఎం.వరసత్యనారాయణ, ఎం.ప్రభాకరరావు, నాగులు, వజ్జ బాబూరావు, దువ్వాడ శ్రీకాంత్, లొడగల కామేశ్వరరావు, టంకాల రవిశంకర్ గుప్తా, జోగ మల్లి, పైల చక్రధర్, ఎం.నాని, బి.నాగరాజు, ఎస్.నవీన్ పాల్గొన్నారు.

ప్రజాస్వామిక పోరాట శక్తులను బలపరచాలి

ప్రజాశక్తి- నౌపడ

ఈ ఎన్నికల్లో ప్రజాస్వామిక పోరాట శక్తులను బలపరచాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శి తాండ్ర ప్రకాష్ పిలుపునిచ్చారు. సంతబొమ్మాళి మండలం వడ్డితండ్రా, కోటబొమ్మాళి మండలం ఊడికలపాడులో ఆ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి బుధవారం మాట్లాడారు. బిజెపితో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేన కూటమిని ఓడించాలన్నారు. అలాగే బిజెపితో కుమ్మక్కైన వైసిపినీ తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఫాసిస్టు వ్యతిరేక, సామ్రాజ్యవాద, భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లో ముందుండే విప్లవ, ప్రజాస్వామిక, పోరాట శక్తులను బలపరచాలని కోరారు. ఆరెస్సెస్-బిజెపి మనువాద, కార్పొరేట్ ఫాసిస్టు ఎజెండాకు ప్రత్యామ్నాయంగా

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తాండ్ర ప్రకాష్

దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, మహిళలు, రైతులు, కూలీలు, కార్మికులు, విద్యార్థులు, యువకులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు కలిసి సమరశీల పోరాటాలకు సమాయత్తం కావాలన్నారు. ప్రచారంలో న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు సార జగన్, ఎన్.వెంకటరావు, కేశవ, నానాజీరావు పాల్గొన్నారు.

అప్పలరాజును గెలిపించాలి

మాట్లాడుతున్న శ్రీదేవి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ రోటరీ నగర్‌లో బుధవారం మార్కండేయ పద్మశాలి సంఘం సభ్యులతో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సతీమణి సీదిరి శ్రీదేవి బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త అప్పలరాజును వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, ప్రతిఒక్కరికీ సహాయ, సహకారాలు అందించారని అన్నారు. మరోసారి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేస్తారని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పలాస ఎమ్మెల్యేగా అప్పలరాజును, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్షులు ఎం.శివ, పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, వైస్ చైర్మన్ బోర బుజ్జి, బోర చంద్రకళ, సనపల సింహాచలం, ఆర్.శంకరరావు, ఎం.వం సత్యనారాయణ, ఎం.ప్రభాకరరావు, నాగులు పాల్గొన్నారు.

అశోక్ సతీమణి ప్రచారం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణంలో వర్తక వాణిజ్య వ్యాపారులతో నేరుగా కలిసి టిడిపి అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలతో కూడిన పోస్టర్లను ఎమ్మెల్యే బెందాళం అశోక్ సతీమణి నీలోత్పల అందజేశారు. పట్టణంలో బస్టాండ్, బజార్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అశోక్, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కళ్ల ధర్మారావు,

ప్రచారం చేస్తున్న నీలోత్పల

లీలారాణి, నందికా జాని, కాళ్ల జయదేవ్, కొండ శంకర్‌రెడ్డి, కాళ్ల దిలీప్‌కుమార్, నందిగాం సరస్వతి, జిలానీ, జిన్నెలా సంతోష్, ఉన్న సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

వైసిపితోనే అభివృద్ధి

మాట్లాడుతున్న విజయ

కవిటి: రాష్ట్రంలో వైసిపితోనే అభివృద్ధి సాధ్యమని, గత ఐదేళ్లుగా రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత వైసిపిదేనని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ అన్నారు. కవిటి మండలం ఎర్ర గోవిందపుట్టుగ, మెలియాపుట్టుగ, డొంకపుట్టుగ, పెద్ద పొడియా వీధి, తొత్తిడి పుట్టుగ గ్రామాల్లో వైసిపి నాయకులతో కలిసి బుధవారం ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటినీ కలియతిరిగి రాబోయే ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విజయ, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో మళ్లీ సంక్షేమ పాలన కావాలంటే వైసిపి అధికారంలోకి రావాలని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పూడి లక్ష్మణరావు, పూడి నేతాజీ, పూడి నీలాచలం, పాండవ శేఖర్, బర్ల నాగభూషణం, బెందాళం రమణమూర్తి, పిరియా కృష్ణారావు, దుద్ది సతీష్, పిరియా సత్యనారాయణ, మానేక్ శంకర్ ప్రధాన్, కృష్ణా రౌలో, అలిగి ధర్మారావు, మొగిలిపురి సీతాలు పాల్గొన్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

సన్మానిస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీలు, ఉద్యోగ విరమణలు సర్వసాధారణమని, విధినిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ (1104) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వి.గోపాలరావు అన్నారు. పలాస విద్యుత్ శాఖ కార్యాలయంలో జూనియర్ అకౌంటెంట్ అధికారిగా పనిచేస్తున్న మాధవరావు ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఈ మేరకు కాశీబుగ్గ ప్రయివేటు కళ్యాణ మండపంలో మాధవరావు దంపతులకు విద్యుత్ శాఖాధికారులు దుశ్శాలువ కప్పి బుధవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ మాధవరావు సేవలు మరువలేని కొనియాడారు. అనంతరం మాధవరావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సేవలు అందించిన విద్యుత్‌శాఖ ఉద్యోగాన్ని విడిచిపెట్టి రావడం బాధగా ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరరావు, కమ్యూనికేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ప్రభాకరరావు, శ్రీకాకుళం సీనియర్ అకౌంటెంట్ అధికారి తాతాచార్యులు, పలాస ఇఇ జి.ప్రసాద్, డిఇ కృష్ణమూర్తి, మండల కార్యదర్శి గార రాజారావు, ఎఇలు నాగభూషణరావు, వివేకానంద పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతోనే విజయం

ప్రజాశక్తి- టెక్కలి

ప్రస్తుత ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వల్లే వైసిపి అభ్యర్థులు విజయం సాధిస్తారని నీటి సంఘం మాజీ అధ్యక్షులు సత్తారు వెంకటరమణ అన్నారు. మండలంలోని గోపీనాథ్‌పురంలో బుధవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి పాటుపడింది వైసిపి ప్రభుత్వమేనని అన్నారు. వ్యవస్థలను సమూలంగా ప్రక్షాలన చేపట్టి ప్రజా శ్రేయస్సు కోసం శ్రమించిన జగన్మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ విజయం కోసం ప్రజలు కృషి చేయాలని కోరారు. ఈయనతో పాటు ధవళ కుశుడు తదితరులు ఉన్నారు.

నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ఇచ్ఛాపురం: కాశీలో శ్రీవాగ్దేవి వాద్య సంగీత కళా నృత్య సాంస్కృతి సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన నృత్య ప్రదర్శనలో ఇచ్ఛాపురానికి చెందిన స్వేచ్ఛా నృత్య అకాడమీ కళాకారుల నాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం స్వేచ్ఛా నృత్య నాట్య కళాకారుల బృందానికి నాట్య శివనర్తన నంది అవార్డును అందజేశారు. స్వేచ్ఛా నృత్య తరంగిణి కూచిపూడి భరతనాట్యం జానపద నాట్య శిక్షణళయం కళాకారులకు అవకాశం లభించింది. కాశీలో కాశీ విశ్వనాధునికి నృత్య పుష్పాంజలి ఈ నెల 5,6 తేదీల్లో నిర్వహించారు. కాశీ సోమేశ్వర ఘాట్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. కళాకారులకు అకాడమీ అధ్యక్షులు కె.గోవిందరావు. కోశాధికారి మంగి దలమ్మ, నృత్య కళాకారుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

పార్టీ కండువా వేస్తున్న దాసరి రాజు

జనసేనలో పలువురు చేరిక

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నియోజవర్గం జనసేన పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త దాసరి రాజు, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ తిప్పన దుర్యోధనరెడ్డి ఆధ్వర్యాన మండలంలోని డొంకూరులో యువకులు ఉత్సాహంగా పార్టీలో చేరారు. జనసేన ఆశయాలు, సిద్ధాంతాలు నచ్చి జనసేనలో చేరుతున్నారని అన్నారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన మున్సిపాలిటీ ఇన్‌ఛార్జి రోకళ్ల భాస్కరరావు, మణి, ఎన్.రఘు, బన్నీ, గోవింద్, క్రాంతి, నవీన్, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో దళితులకు అన్యాయం

పలాస : వైసిపి ప్రభుత్వంలో దళితులకు అన్యాయం జరిగిందని టిడిపి మహిళా నాయకులు కావలి గ్రీష్మ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఎంఆర్‌పి నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ నాయకులు టిడిపికి మద్దతు తెలిపారని అన్నారు. ఎక్కడ చూసినా ఈ ఐదేళ్లలో దళితులపై దాడులు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తం గా టిడిపి అభ్యర్థులను గెలుపించడమే తమ ధ్యేయమన్నారు. పలాస ఎమ్మెల్యే అభ్యర్థిగా గౌతు శిరీషను పలాస నియోజక వర్గంలో గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు మీల జోగారావు, బోసుబాబు, బోనెల భైరాగి, రాజారావు, టి.పాపారావు, పి.మల్లేసు, పి.హరి, రాజారావు, ప్రసాద్, శివ, ప్రసాద్‌కుమార్, బోనెల రాజు, శివయ్య, ధర్మప్రసాద్, అప్పలస్వామి, శంకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గ్రీష్మ

రిసెప్షన్ సెంటర్ కీలకం

- కేటాయించిన రూట్ల వాహనాలకు అనుమతి
- పార్కింగ్ స్థలాల్లో నిలుపుదలకు అవకాశం
- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

పోలింగ్ అనంతరం ఇవిఎంలను భద్రపరచడానికి కేటాయించిన శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో రిసెప్షన్ కౌంటర్ కీలకమని జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. కేటాయించిన రూట్ల ద్వారా పార్కింగ్ వద్దకే వాహనాలు చేరుకోవాలని ఆదేశించారు. స్థానిక శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో రిసెప్షన్, స్ట్రాంగ్‌రూమ్ వద్ద వహించాల్సిన జాగ్రత్తలపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ అనంతరం ఇవిఎంలు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచాలన్నారు. ఎక్కడికక్కడ సైనేజ్ బోర్డులు, లైటింగ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. రిటర్నింగ్ అధికారులు కౌంట్ చేసుకొని అన్ని వాహనాలు సులువుగా వచ్చేలా చూడాలన్నారు. ట్రాఫిక్ జామ్ కాకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఆయా నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ ప్రాంతాల్లో వైద్యారోగ్యశాఖ స్టాల్స్ ఏర్పాటు చేయాలని డిఎంహెచ్‌ఒను ఆదేశించారు.

మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ ఆయా నియోజక వర్గాలకు సంబంధించి సైనేజస్ ఏర్పాటు చేస్తామన్నారు. జాగ్రత్తగా చూసుకుని వాహనాలు ఆయా నియోజకవర్గాలకు చేరుకోవాలని తెలిపారు. లోపలికి ప్రవేశము, వెలుపలికి వెళ్లే రూట్లను ముందుగానే చూసుకోవాలని చెప్పారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తమీమా అన్సారియా మాట్లాడుతూ ఎవరికి కేటాయించిన విధులు వారు నిర్వహించాలన్నారు. చేయాల్సిన ప్రతి పనిని తయారు చేసుకొని ఒక్కో పని పూర్తి చేయాలన్నారు. పార్కింగ్ ఏరియా వద్ద, పార్కింగ్ పక్కన మరుగుదొడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు పారిశుధ్య కార్మికులు ఉంటారని చెప్పారు. తాగునీరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు నూరుల్ కమర్, భరత్ నాయక్, సిహెచ్.రంగయ్య, రామ్మోహన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఎఎస్‌పి ప్రేమ్‌కాజల్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

విశ్రాంత హోంగార్డుకు చెక్కును అందజేస్తున్న ఎస్‌పి రాధిక

విశ్రాంత హోంగార్డుకు చెక్కు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వహించి గత నెల ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు యు.ఉమా మహేశ్వరరావుకు జిల్లాలో సహచర హోం గార్డులు స్వతహాగా అందించిన ఒక్కరోజు గౌరవ వేతనం రూ.4.18 లక్షల నగదు చెక్కును బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి జి.ఆర్.రాధిక చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పదవీ విరమణ పొంది నప్పటికీ ఎటువంటి అవసరం ఉన్నా నేరుగా సంప్రదించవచ్చని, ఇచ్చిన నగదును భవిష్యత్‌లో కుటుంబ అవసరాల మేరకు ఉపయోగించుకోవాలని, ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని ఎస్‌పి సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి జి.ప్రేమకాజల్, ఆర్ఐ కె.నర్సింగరావు ఉన్నారు.

రామస్వామిని పరామర్శిస్తున్న జయరాం తదితరులు

రామస్వామి కుటుంబానికి అండగా ఉంటాం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని అల్లెన గ్రామానికి చెందిన సిరిపురపు రామస్వామి కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి, తూర్పుకాపు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్ల జయరాం హామీ ఇచ్చారు. బుధవారం బోను క్యాన్సర్‌తో బాధపడుతున్న రామస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వ్యక్తిగతంగా, పార్టీ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. అంతకు ముందు రామస్వామి తల్లి సిరిపురపు సూరమ్మను పరామర్శించి ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి విక్రమ్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు గేదెల వాసు, జనసేన నాయకులు రాజేష్, కిమిడి గణేష్, మాడుగుల కాశి, పొగిడి ఆనంద్, శ్రవణ్ తదితరులున్నారు.

ముగిసిన తలసేమియా వారోత్సవాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రపంచ తలసేమియా రోజును పురస్కరించుకొని వారంరోజులుగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన పలు కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం బ్లడ్‌బ్యాంకు ఆవరణలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో శ్యాం ప్రసాద్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ హాజరై మాట్లాడారు. రోగులకు సకాలంలో వైద్యం అందించడానికి రక్తమిచ్చి రెడ్‌క్రాస్ ఆదుకుంటోందన్నారు. ఈ సందర్భంగా బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జిల్లాలో ఉన్న 150 మంది తలసేమియా వ్యాధిగ్రస్తులైన పిల్లలకు పౌష్టికాహారం, డ్రై ఫ్రూట్స్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహనరావు, రిటైర్డ్ జెసి రజనీకాంత్, ట్రెజరర్ కె.దుర్గ శ్రీనివాస్, సెక్రటరీ మల్లేశ్వరరావు, బి.సతీష్ పాల్గొన్నారు.

కిట్లతో చిన్నారులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు

ఎన్నికల వాహనాలకు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఈనెల 13న ఎన్నికల అనంతరం ఇవిఎంలు, ఇతర ఎన్నికల సామగ్రిని తీసుకొచ్చే వాహనాలకు ఎటువంటి ట్రాఫిక్ అవాంతరాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. స్థానిక శివానీ ఇంజినీరింగ్ కళాశాల వద్ద రిసెప్షన్ కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఇవిఎంలు, ఎన్నికల సామగ్రి వచ్చే రహదారి రూట్‌మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శివానీ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లో ఇవిఎంలు, ఎన్నికల సామగ్రిని భద్రపరచనున్నట్లు తెలిపారు. నియోజకవర్గాల వారీగా ఎన్నికల సిబ్బంది ఎన్నికల సామగ్రి డిపాజిట్ చేసే మార్గంలో బారికేడ్స్, రూట్‌మ్యాప్ తెలిపే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పకడ్బందీ ప్రణాళికలు చేపట్టాలన్నారు. రహదారి మార్గంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ఎక్కడ ఎంతమంది సిబ్బందిని నియమించాలో ముందస్తుగా గుర్తించాలన్నారు. డిపాజిట్ రోజున హైవే అథారిటీ సహకారంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆమె వెంట ఎఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్, సిఐలు రామచంద్రరావు, ఎం.అవతారం, ఎస్ఐ చిరంజీవి ఉన్నారు.

రూట్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

ఐఎఫ్‌ఎస్‌కు కృష్ణచైతన్య ఎంపిక

ప్రజాశక్తి-సరుబుజ్జిలి

కృష్ణచైతన్య

మండలంలోని కూన జమ్మన్నపేటకు చెందిన సింగూరు కృష్ణ చైతన్య ఐఎఫ్‌ఎస్‌కు ఎంపికయ్యారు. ఉన్నత ఉద్యోగానికి కుమారుడు ఎంపిక కావడం పట్ల తల్లి దండ్రులు రంగ నాయకులు, మీనా కుమారితో పాటు బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2021లో నిర్వహించిన సివిల్స్ ఐఎఫ్ఎస్ పరీక్షలో ఇంటర్వ్యూ స్థాయి వరకు వెళ్లిన కృష్ణ చైతన్యకు నిరాశ ఎదురైంది. అయితే పట్టువదలని కృష్ణ చైతన్య ఈసారి ఎలాగైనా ఉద్యోగం సాధించాలని సివిల్స్‌ని విడిచిపెట్టి కేవలం అటవీశాఖలో ఉన్నత ఉద్యోగం సాధించడానికి ప్రయత్నం ప్రారంభించాడు. ఇంటివద్దనే తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆన్‌లైన్ కోచింగ్ ద్వారా 2023లో నిర్వహించిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ పరీక్షలు రాసి గురువారం విడుదల చేసిన యుపిఎస్‌సి ఫలితాల్లో కృష్ణ చైతన్యకు ఆల్ ఇండియా కేటగిరీలో 83వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం కృష్ణచైతన్య ఇపిఎఫ్ఒ డిపార్ట్‌మెంట్‌లో అకౌంట్ ఆఫీసర్‌గా విశాఖపట్నంలో విధులు నిర్వహిస్తున్నాడు.

ప్రచారం చేస్తున్న గొండు శంకర్

మోడల్ సిటీగా శ్రీకాకుళం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో 16వ డివిజన్ పరిధిలోని గొంటివీధిలో డివిజన్ ఇన్‌ఛార్జి ఎస్‌వి రమణ మాదిగ, టిడిపి నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ ఆధ్వర్యాన బుధవారం ప్రజాగళం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ పాల్గొని ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రజలు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. టిడిపి హయాంలో మొదలు పెట్టిన అనేక అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రధానమైన ఆమదాలవలస రోడ్డుతో పాటు నగరంలో చాలా రోడ్లు అధ్వన్న స్థితిలో ఉన్నాయని, చాలా ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడ కరువయ్యాయని చెప్పారు. జగన్ పాలనలో రాష్ట్రం వెనుకబాటుకు గురైందని, రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు బాబు మళ్లీ సిఎం కావాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం యువ నాయకులుగా రామ్మోహన్ నాయుడు, తాను కృషి చేస్తామని, నగరాన్ని సుందర శ్రీకాకుళంగా తీర్చి దిద్దుతామని హామీనిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు సవళాపురపు లక్ష్మి, కొండలరావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

7,823 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించామని విశ్రాంత జడ్జి డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. విద్యుత్ డిఇ కార్యాలయంలో ఫిర్యాదుల మేళాను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు ఐదు కోట్ల 55 లక్షల 50 రూపాయలు నష్టపరిహారం సంస్థ నుంచి చెల్లించడానికి తీర్పునిచ్చామని అన్నారు. 2023లో 325 కేసులు విద్యుత్ వినియోగదారుల అనుకూలంగా తీర్పులు వచ్చాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ టోల్ ఫ్రీ నంబరు 1912కి కాల్ చేసి ఫిర్యాదు చేయొచ్చని అన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలో నెలనెలా సదస్సులను ఏర్పాటు చేస్తున్నామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సిజిఆర్ఎఫ్ ఆర్థిక సభ్యులు ఎం.శ్రీనివాస్, డిఇ జి.శంఖరావు, ఎడి కృష్ణమూర్తి, ఎఇ తమ్మినేని ఈశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

ఐదేళ్లలో అభివృద్ధి చేసి చూపించా...

ప్రజాశక్తి- పలాస

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి తనకు ఒక్క ఛాన్స్ ఇచ్చి ఎమ్మెల్యేగా, మంత్రిగా పదవి కట్టబెట్టడంతో పలాస నియోజకవర్గంలో ఐదేళ్ల కాలంలో అభివృద్ధి చేసి చూపించానని, మరోసారి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేసి ప్రజలకు సేవలు అందిస్తామని పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని భైరిసారంగపురం, బాలిగాం, హరిపురం గ్రామాల్లో బుధవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి నాయకులు ఇస్తున్న బూటకపు హామీలను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. వైసిపి హయాంలో మందస రోడ్డు విస్తరణ పనులు చేపట్టి సుందరంగా తీర్చిదిద్దామన్నారు. గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఉద్దాన ప్రాంతంలో రోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వాస్పత్రులు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. గ్రామాల్లో ప్రజల సమస్యలు పరిష్కారానికి సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి రైతు భరోసా, సచివాలయం, హెల్త్ సెంటర్ల భవనాలు సైతం నిర్మాణాలు చేపట్టామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి డొక్కరి దానయ్య, జెడ్‌పిటిసి సవర చంద్రమ్మ, అగ్గున సూర్యారావు, చింతాడ గణపతిలు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న మంత్రి అప్పలరాజు